VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
ఆదివారం 31 మార్చి 2024
సంపుటి.01 సంచిక.236

# కరెంటు కోతలు ఉండొద్దు

రాష్ట్రంలో గత రెండు వారాలుగా రోజూ 14,000- 15,000 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఉంటోంది. ఈక్రమంలో వేసవి అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు సరఫరా చేసే కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా, పంటలు ఎండిపోకుండా, పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా కరెంటు సరఫరా జరిగేలా చూడాలని చెప్పారు.

రాష్ట్రంలో అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేయాలని, తాగునీటికి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు.

## తాగునీటి కొరతను అధిగమించాలి

## వేసవికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలి

## సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



2 లో

# పార్టీ వీడుతున్న వారిపై అనర్హత

స్పీకర్‌కు నోటీస్ ఇచ్చేందుకు వచ్చిన బిఆర్ఎస్

2 లో



2 లో

# మా ఎమ్మెల్యేలను టచ్ చేస్తే అంతే సంగతులు

## 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుంది

మంత్రి కోమిరెడ్డి వ్యాఖ్యలపై బిజెపి పక్షనేత హెచ్చరిక

# ఎవరు వెళ్లినా బీఆర్ఎస్‌కు నష్టం లేదు

## పార్టీలో గట్టి కార్యకర్తలే మిగిలారు

## కాంగ్రెస్ మాయమాటలకు ప్రజలు మోసపోయారు

## మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి విమర్శలు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, చేస్తున్న మోసాలను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజల కోసం ఒక్క పని చేయలేదని.. దేశానికి బీజేపీ చేసింది శూన్యమన్నారు. కులాలు, మతాలను అడ్డం పెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఐటీలను ఉపయోగించి ప్రతిపక్షాలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.





# యువతకు ఉద్యోగావకాశాల కోసం పటిష్ఠ చర్యలు

## కాంగ్రెస్ రోజ్‌గార్ క్రాంతితో పక్కా ప్రణాళిక

## కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ 'రోజ్‌గార్ క్రాంతి తీసుకువస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం ప్రకటించారు. యువతకు ఉద్యోగావకాశాలు పెంచేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందని, వారి ఆకాంక్షల సాఫల్యానికి, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సాహానికి పార్టీ ఈ పథకం ద్వారా కృషి చేస్తుందని ఖర్గే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గ్యారంటీలతో యువత భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని ఆయన చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చిన పక్షంలో'యువ న్యాయ్' గ్యారంటీలను అమలు పరుస్తుందని ఖర్గే పునరుద్ఘాటించారు. 'కాంగ్రెస్ పార్టీ యువ న్యాయ్ గ్యారంటీ ద్వారా 'రోజ్‌గార్ క్రాంతి' తీసుకువస్తుంది. మన యువతకు ఉద్యోగావకాశాలు పెంపుదలకు, పరిశ్రమల స్థాపన దిశగా ప్రోత్సాహానికి, వారి కలలు, ఆకాంక్షల సాఫల్యానికి మేము పటిష్ఠమైన చర్యలు తీసుకుంటాం' అని ఖర్గే 'ఎక్స్'చ పోస్ట్‌లో హామీ ఇచ్చారు. 'యువ న్యాయ్' పథకం కింద పార్టీ ఇవ్వనున్న గ్యారంటీలను ఖర్గే వివరించారు.
'భారతీ భరోసా' గ్యారంటీ కింద తమ పార్టీ జాబ్ క్యాలెండర్ ప్రకారం 30 లక్షల కొత్త కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుందని, 'పెహ్లీ నౌకీ పక్కీ'లో భాగంగా ఏడాదికి ఒక లక్ష రూపాయలు వంతున విద్యాధిక యువజనులు అందరికీ ఒక ఏడాది అప్రెంటిస్‌షిప్ హక్కు కల్పిస్తుందని ఖర్గే తెలియజేశారు.
'పేపర్ లీక్ సే ముక్తి' గ్యారంటీ కింద పార్టీ అన్ని పేపర్ల లీక్‌లను పూర్తిగా కట్టడి చేయడానికి ఒక చట్టం చేస్తుందని పార్టీ అధ్యక్షుడు తెలిపారు. జిగ్ కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు, సామాజిక భద్రత కల్పిస్తుందని, యువత కోసం రూ. 5000 కోట్ల స్టార్టప్ నిధి ఏర్పాటు చేస్తుందని ఖర్గే తెలియజేశారు. ఐదు న్యాయ్‌లు / నారీ న్యాయ్, యువ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, కిసాన్ న్యాయ్, హిస్సేదారి న్యాయ్ కింద 25 గ్యారంటీలతో లోక్‌సభ ఎన్నికలలో ప్రచారానికి కాంగ్రెస్ వ్యూహం రూపొందించింది. అధికారంలోకి వచ్చినట్లయితే వాటిని అమలు చేస్తామని పార్టీ వాగ్దానం చేసింది.

# ఎండిన పంటల పరిశీలనకు కెసిఆర్

## నేడు జనగామ,భువనగిరి జిల్లాల్లో పర్యటన

## పంటలు పరిశీలించి రైతులతో ముఖాముఖి



**హైదరాబాద్:** సాగునీరు అందక పంటలు ఎండిపోయి, అకాల వర్షాలతో దెబ్బతిని అల్లాడుతున్న రైతాంగానికి ధైర్యాన్ని నూరిపోసేందుకు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. పలు జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలించి రైతులను ఓదార్చనున్నారు. ఆదివారం ఆయన నేరుగా రైతుల వద్దకు వెళ్లి, మీకు మేము అండగా ఉంటామన్న భరోసా కల్పించ నున్నారు. సూర్యాపేట, నల్లగొండ, జనగామ జిల్లాల్లోని పలు మండలాల్లో పర్యటించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు కేసీఆర్ ఎర్రవెల్లి నుంచి జిల్లాల పర్యటనకు రోడ్డు మార్గంలో బయల్దేరుతారు. జనగామ జిల్లాలోని ధరావత్ తండాకు ఉదయం 10:30 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. 11:30 గంటలకు సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి మండలం, అర్వపల్లి మండలం, సూర్యాపేట రూరల్ మండలాల్లో పర్యటించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సూర్యాపేట రూరల్ మండలం నుంచి బయల్దేరి.. 1:30 గంటల వరకు సూర్యాపేట నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులోనే లంచ్ చేయనున్నారు. 3 గంటలకు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.
మధ్యాహ్నం 3:30 గంటలకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నుంచి నల్లగొండ జిల్లాకు బయల్దేరుతారు.
సాయంత్రం 4:30 గంటలకు నిడమనూరు మండలానికి చేరుకుని ఎండిపోయిన పంటలను పరిశీలించనున్నారు.
సాయంత్రం 6 గంటలకు నిడమనూరు నుంచి ఎర్రవెల్లికి బయల్దేరనున్నారు. రోడ్డు మార్గం గుండా ప్రయాణించి రాత్రి 7 గంటలకు కేసీఆర్ ఎర్రవెల్లికి చేరుకోనున్నారు.



# నియోజకవర్గం అభివృద్దే మన లక్ష్యం

## పార్టీ మారినా ఫరవాలేదన్న కార్యకర్తలు

## కాంగ్రెస్‌లో చేరికపై అనుయాయులతో కడియం చర్చ

## కావ్యను ఆశీర్వదించాలని కార్యకర్తలకు వినతి

## పార్టీలో సమన్వయ లోపం ఉందన్న కావ్య

## పార్టీ శ్రేణులు ఎవ్వరూ సహకరించలేదని ఆరోపణ

**హైదరాబాద్:** భారాస నేతలు అయోమయంలో ఉన్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆ పార్టీని వీడేందుకు సిద్ధమైన ఆయన తదుపరి కార్యాచరణపై దృష్టి సారించారు. కాంగ్రెస్ ఆహ్వానం నేపథ్యంలో ఆ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు కుమార్తె కావ్యతో కలిసి మంత్రుల నివాస ప్రాంగణంలో తన అనుచరులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ నేతలు తనను పార్టీలోకి ఆహ్వానించారని, రెండ్రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పినట్టు తెలిపారు. కడియం ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతిస్తామని ఆయన అనుచరులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారాస బలహీనపడిందన్న కడియం.. పార్టీ నేతల నుంచి సహకారం లభించలేదని తెలిపారు. ఓడిపోయే పార్టీ నుంచి పోటీ వద్దని కావ్య అనుకున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేయమని పిలుపు వచ్చిందని, అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందన్నారు. ఆరూరి రమేష్ వద్దంటేనే కావ్యకు టికెట్ ఇచ్చారని చెప్పారు. తనను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్న ఆయన.. కావ్యను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కీలక ప్రకటన చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తలతో కడియం శ్రీహరి శనివారం నాడు సమావేశం అయ్యారు. పార్టీ మారుదామా వద్దా అని కార్యకర్తలను కడియం అడిగారు. బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోలేమని కడియంకు కార్యకర్తలు చెప్పారు. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మీ వెంటే ఉంటామని ఏక వాక్య తీర్మానాన్ని కడియం శ్రీహరి అనుచరులు చేశారు. అయితే కార్యకర్తల నిర్ణయాన్ని బట్టి తాను నడుస్తానని కడియం తెలిపారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానంటే బీఆర్ఎస్ పార్టీకి భయమెందుకని ప్రశ్నించారు.

# పాలనపై సోయిలేని సీఎం రేవంత్

## పంటలు ఎండిపోయి రైతులు ఏడుస్తున్నా పట్టింపేది

## కెసిఆర్ సిఎంగా ఉంటే..ఈ కష్టం వచ్చేదా

## మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు



నల్లగొండ:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనపై సోయి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట బిఆర్ఎస్ జగదీశ్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే కనీసం సమీక్ష కూడా చేయడం లేదన్నారు. ఇదేనా పాలన అంటే అని విమర్శించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీ లింగయ్య యాదవ్, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ఆదివారం నల్లగొండ జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. ఉదయం 9గంటలకు బయలుదేరి భువనగిరి మీదుగా జనగామ వెళ్తారన్నారు. మొదట దేవరప్పులలో ఎండిన పంటలను పరిశీలిస్తారని చెప్పారు. ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లి, తుంగతుర్తి మండలాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తారన్నారు. అనంతరం సూర్యాపేట పట్టణంలోని జనగామ రోడ్‌లోని పంటలను పరిశీలిస్తారన్నారు. సూర్యాపేటలో మీడిఆయాతో మాట్లాడుతారని అన్నారు. అక్కడి నుంచి హాలియా, మిర్యాలగూడ రోడ్ పక్కన ఉన్న సాగర్ ఆయకట్టులో ఎండిన పొలాలను పరిశీలించి.. హైదరాబాద్‌కు బయలుదేరుతారన్నారు. ఆరోగ్యం బాగా లేకున్నా రైతుల కష్టాలు చూడలేక కేసీఆర్ ఆదివారం అన్నదాతల వద్దకు వస్తున్నారన్నారు. రేవంత్‌కి పరిపాలనపై సోయిలేదని.. ఇప్పటివరకు వ్యవసాయంపై సమీక్ష లేదని.. మంత్రి కూడా సమీక్ష చేయలేదరన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కేసీఆర్ ఉంటే భూమి ఆకాశనీ ఒక్కటి చేసైనా సరే అన్నదాతలకు నీళ్లు అందించేవారన్నారు. కానీ, ఇవాళ దరిద్రమైన ప్రభుత్వం ఉన్నదన్నారు. రాష్ట్రంలో నీళ్లు అందక లక్షల ఎకరాలు ఎండిపోయా యని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మోర పెట్టుకున్నా ప్రభుత్వంలో కదలిక లేదన్నారు. నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వలేదని.. ప్రభుత్వం నిర్లక్ష్యంతో అన్నదాతలు ఆగం అయ్యారన్నారు. ÷శీసీఆర్‌పై కోపంతో రైతులను బలి పెట్టారు కాంగ్రెస్ వాళ్లు.. సాగర్‌లో డెడ్ స్టోరేజ్ నీళ్లు ఉన్నా అప్పుడు నీళ్లు అందించామన్నారు. అన్నదాతలను కాపాడుకున్నామని.. కానీ, ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడని.. ఎస్సారెస్పీ కింద సూర్యాపేట జిల్లాలో నీళ్లు ఇస్తామన్నారు. పంటలు సాగు చేయండని చెప్పి మరి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నీళ్లు ఇవ్వక ఎక్కడికక్కడ ఎండిపోయాయని అన్నారు. జిల్లా మంత్రులు అక్రమ వసూళ్లు, దందాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. మిల్లర్లను బెదిరింపు చేసి కోట్లు వసూలు చేశారని.. మిల్లర్లు ఏమో అన్నదాతలను పీక్కోని తింటున్నరని విమర్శించారు. కోమటిరెడ్డి ఓ బడ్డారఖాన్.. ఓ జోకర్.. ఆయన మాటలకు ఎక్కడ విలువ లేదన్నారు. ఎంపీ లింగయ్య యాదవ్ రేవంత్ రెడ్డి సీఎం ఉడడం లేదన్నారు. దౌర్భాగ్యం జిల్లాలో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. కేసీఆర్ జిల్లాలో పర్యటిస్తున్నారని, రైతుల అండగా ఉంటారన్నారు. పరిపాలన చేతకాక రేవంత్ అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ నయవంచనను అర్థం చేసుకోవాలని కోరారు. రేపటి ఎన్నికల్లో ప్రజలు నిలదీస్తే సమస్యలు తెలుస్తాయని అన్నారు. రైతులకు ఏం సమాధానం చెబుతారో చూస్తామని అన్నారు.

# పార్టీ వీడుతున్న వారిపై అనర్హత

## స్పీకర్‌కు నోటీస్ ఇచ్చేందుకు వచ్చిన బిఆర్ఎస్

**హైదరాబాద్:** తమ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరాలని భావిస్తున్న,చేరిన వారిపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ భావిస్తోంది. ఇప్పటికే దానం నాగేందర్‌తో పాటు పలవురు కాంగ్రెస్‌లో చేరారు. కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్దం అయ్యారు. ఈ క్రమంలో చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ యోచిస్తోంది. అనర్హత వేటు వేయించే దిశగా బీఆర్ఎస్ ముందుకు సాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ నుంచి పోటీ చేసి గెలిచారు. లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన కూతురు కడియం కావ్యకు టిక్కెట్ కూడా ఇప్పించుకున్నారు. కానీ కొన్ని రోజులకే వారు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు పిటిషన్ ఇచ్చేందుకు అసెంబ్లీకి వచ్చారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్ శనివారం అసెంబ్లీకి వచ్చారు. అయితే స్పీకర్ అందుబాటులో లేరని సిబ్బంది చెప్పడంతో అసెంబ్లీ కార్యదర్శికి పిటిషన్ ఇవ్వాలని నిర్ణయించారు. ఆయన కూడా లేరని చెప్పడంతో ఎమ్మెల్యేలు అక్కడి నుంచి వెనుదిరిగారు.

# మా ఎమ్మెల్యేలను టచ్ చేస్తే అంతే సంగతులు

**హైదరాబాద్:** బిజెపి ఎమ్మెల్యేలను ముట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే కూల్చేస్తామని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. మంత్రి వ్యాఖ్యలపై మహేశ్వర రెడ్డి స్పందించారు. ఒక్క బీజేపీ ఎమ్మెల్యేను టచ్ చేస్తే తెలంగాణ రాష్ట్రంలో 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని హెచ్చరించారు. బీజేపీ హైకమాండ్‌తో తెలంగాణ మంత్రులు టచ్‌లో ఉన్నారని మహేశ్వర రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా ఐదుగురు మంత్రులు సంప్రదింపులు జరిపారని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలతో సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కూడా పట్టడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీతో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారనే మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలను మహేశ్వర రెడ్డి ఖండించారు. కోమటిరెడ్డి తమ్ముడు రాజగోపాల్ రెడ్డి టచ్‌లో ఉన్నాడో లేడో తెలుసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ చేత ఎందుకు విచారించడం లేదని మహేశ్వర రెడ్డి నిలదీశారు. రంజిత్ రెడ్డి భూములపై ఆరోపణలు చేశారు.. తర్వాత పార్టీలో చేర్చుకుని పక్కన కూర్చొబెట్టుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. టెలిఫోన్ యాక్ట్ కేంద్ర ప్రభుత్వానిది అయినందున ఆ కేసు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యేల గురించి మాట్లాడే స్థాయి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లేదని మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. భువనగిరి ఎంపీ సీటును వెంకట్ రెడ్డి గెలిపించుకోవాలని సవాల్ విసిరారు. చేరికలకు సంబంధించి బీజేపీ గేట్లు తీస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 48 గంటలు కూడా ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ఏక్‌నాథ్ షిండే పాత్ర పోషించడానికి చాలా మంది నేతలు ఉన్నారని హాట్ కామెంట్స్ చేశారు. రాజీనామా చేసిన తర్వాత ఈటల రాజేందర్ బీజేపీలో చేరారని మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఆర్ టాక్స్ వసూల్ చేస్తున్నారని మహేశ్వర రెడ్డి ఆరోపించారు. ఆర్ అంటే రేవంత్, రాహుల్, రాజీవ్.. ఇందులో ఏ పేరుతో ట్యాక్స్ వసూల్ చేస్తున్నారో మాత్రం తెలియదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రూ.1500 కోట్లు హైకమాండ్‌కు పంపించారని వివరించారు. మరో రూ.500 కోట్లు పంపించాల్సి ఉందని గుర్తుచేశారు.

# సేవ్ రాయలసీమ నినాదంగా మారాలి

**కడప:** జగన్ క్విట్ రాయలసీమ అంటూ...చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇక సీమలో నీ ఆగడాలు సాగవని అన్నారు. జగన్ ఇంటికి పోవడం ఖాయమని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఐదేళ్లలో రాయలసీమకు ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. ప్రొద్దుటూరు ప్రజాగళం ప్రచార సభలో చంద్రబాబు ప్రసంగించారు. 'జగన్‌కు రాయలసీమ అంటే హింస, హత్యా రాజకీయాలు.. తెదేపాకు సీమ అంటే నీళ్లు, ప్రాజెక్టులు, పరిశ్రమలు. రైతును రాజు చేయడం తెదేపా సంకల్పం. పులివెందుల ప్రజలు కూడా జగన్‌ను నమ్మేది లేదంటున్నారు. విపరీతమైన మార్పు వచ్చింది.. ట్రెండ్ మారింది.. వైకాపా బెండు తీస్తారు. వైకాపా నేతల దాడులకు తెదేపా కార్యకర్తలు భయపడలేదు. కడపకు స్టీల్‌ఎ÷-లాంట్ వచ్చి ఉంటే వేలమందికి ఉద్యోగాలు వచ్చేవి. శంకుస్థాపనలు కాదు.. ప్రారంభోత్సవాలు జరగాలి. రాయలసీమకు మేం కియా మోటార్స్ తీసుకొచ్చాం. కరవుసీమలో తయారైన 12 లక్షల కార్లు ప్రపంచంలో పరిగెడుతున్నాయి. నా బ్రాండ్ కియా మోటార్స్ తేవడం.. జగన్ బ్రాండ్ వేసిన స్టీల్‌ప్లాంట్ కు మళ్లీ శంకుస్థాపన చేయడం..! పరిశ్రమలు తేకపోగా.. ఉన్నవాటిని తరిమేశారని మండిపడ్డారు.

'జగన్‌కు నీటి విలువ, ప్రాజెక్టుల గురించి తెలుసా..? రాయలసీమకు నీళ్లిస్తే కోనసీమ కంటే మిన్నగా తయారవుతుంది. కృష్ణా జలాలు రాయలసీమకు తీసుకురావాలనేది నా కల. పోలవరం పూర్తి చేసి గోదావరి నీళ్లు రాయలసీమకు తీసుకురావాలి. ఆ సంకల్పంతోనే 72 శాతం పనులు పూర్తి చేశాం. ఈ ఐదేళ్లలో రాయలసీమలో ఒక్క కంపెనీ అయినా వచ్చిందా..? రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత నాది. క్విట్ జగన్..సేవ్ రాయలసీమ నినాదం కావాలి. ఈ అసమర్థ, అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.ఏపీలో వైఎస్ జగన్ రాక్షస పాలన కొనసాగుతుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆరోపించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు ప్రజాగళం ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. వైసీపీ పాలన కూటమి దెబ్బతో ఇంటికి పోవడం ఖాయమని పేర్కొన్నారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని తెలిపారు. క్విట్ జగన్, సేవ్ రాయలసీమ నినాదం ప్రజల్లో రావాలని,అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కడప స్టీల్‌ఎ÷-లాంట్ వచ్చి ఉంటే వేలమందికి ఉద్యోగాలు వచ్చేవని అన్నారు. టీడీపీ హయాంలో రాయలసీమ కు తీసుకొచ్చిన కియా మోటార్స్ వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రానికి జగన్ ఏ ఒక్క పరిశ్రమ తీసుకురాక, ఉన్న వాటిని తరిమేశారని ఆరోపించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే రాయలసీమ కోనసీమ కంటే అద్భుతంగా తయారవుతుందని వెల్లడించారు.

జగన్‌కు నీటి విలువ, ప్రాజెక్టుల గురించి తెలియదని ఎద్దేవా చేశారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో 12 వేల కోట్లు ఖర్చుపెట్టగా వైసీపీ కేవలం 2కోట్లు మాత్రమే ఖర్చుచేసిందని విమర్శించారు. కృష్ణ జలాలు రాయలసీమకు తీసుకురావాలనేది నా కల అని చంద్రబాబు పేర్కొన్నారు.

# కరెంటు కోతలు ఉండొద్దు

హైదరాబాద్: రాష్ట్రంలో అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేయాలని, తాగునీటికి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ఎండాకాలం కావడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందన్నారు. రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా అందుబాటులో ఉందని, కరెంటు పోయిందనే ఫిర్యాదు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలన్నారు. శనివారం సీఎం రేవంత్ సచివాలయంలో విద్యుత్, తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. రోజురోజుకూ ఎండల వేడి పెరుగుతున్నందున రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఎంత, సరఫరా ఎంత అనేది ప్రతిక్షణం పరిశీలిస్తూ ఉండాలని విద్యుత్ సంస్థలకు ఆదేశాలిచ్చారు. గత ఏడాది కంటే రాష్ట్రంలో ఈసారి అత్యధికంగా కరెంటు సరఫరాతో కొత్త రికార్డును నమోదు చేసినట్లు వివరించారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా మార్చిలో డిమాండ్ గణనీయంగా పెరిగినా సరఫరా ఆగకుండా చూడటంలో డిస్కంలు సమర్థ పాత్ర పోషించాయని రేవంత్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కను ఆయన అభినందించారు. రాష్ట్రంలో గత రెండు వారాలుగా రోజూ 14,000- 15,000 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఉంటోంది. ఈక్రమంలో వేసవి అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు సరఫరా చేసే కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా, పంటలు ఎండిపోకుండా, పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా కరెంటు సరఫరా జరిగేలా చూడాలని చెప్పారు. గత ఏడాది జనవరి నుంచి మార్చి వరకు సగటున రోజుకు 239.19 మిలియన్ యూనిట్ల(మి.యూ) కరెంటు సరఫరా అయింది. ఈఏడాది అదేనెలల్లో సగటున రోజుకు 251.59 మి.యూ. సరఫరా చేసినట్లు సీఎం ప్రకటించారు. గత ఏడాది మార్చి 14న 297.89 మి.యూ. సరఫరా రికార్డు కాగా.. ఈఏడాది 308.54 మి.యూ.తో కొత్త రికార్డు నమోదైందని వివరించారు.

**బోర్లు, బావుల నీటిని వాడుకోండి**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. ఏప్రిల్, మే, జూన్ వరకు స్థానికంగా అందుబాటులో ఉన్న బోర్లు, బావులను తాగునీటి అవసరాలకు వాడుకోవాలని సూచించారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సమస్య ఉన్నచోట తక్షణ పరిష్కారాలను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఒకరిని ప్రత్యేక అధికారిగా నియమించాలన్నారు. వేసవి కోసం ప్రత్యేకంగా గ్రామాల వారీగా తాగునీటి సరఫరాకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. అవసరాన్ని బట్టి ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నీటి ట్యాంకులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రజలు నీటిట్యాంకరు కావాలని అడిగితే 12 గంటల్లోపు చేర్చేలా చూడాలన్నారు. అందుకు అవసరమైనన్ని ట్యాంకర్లు సమకూర్చుకోవాలని తెలిపారు.

# వలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు

**ఎలాంటి ఆర్థిక కార్యక్రమాలు చేపట్టరాదని ఆదేశాలు**

**ఫోన్లు, ట్యాబులు అప్పగించాలని హుకుం**

**అమరావతి:** ఏపీలో వాలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు, లోక్ సభ ఎన్నికల కారణంగా పింఛన్ల పంపిణీ నుంచి వాలంటీర్లను పక్కన పెట్టాలని ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. పింఛన్ మాత్రమే కాదు, ఎలాంటి సంక్షేమ పథకాలకు వాలంటీర్ల ద్వారా నగదు పంపిణీ చేయించవద్దని ఈసీ ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఈసీ తెలిపింది. ఏపీలో ఎన్నికల కోడ్ ముగిసేవరకు వాలంటీర్లకు ఇచ్చిన ట్యాబ్, మొబైల్ డిపాజిట్ చేయాలని తమ ఆదేశాలలో ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పింఛన్ సహా ఇతర సంక్షేమ పథకాల నగదును ఆన్‌లైన్ ద్వారా నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. లేకపోతే రెగ్యూలర్ ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా నగదు పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తన ఆదేశాలలో ఈసీ పేర్కొంది. మార్చి 16న సీఈసీ రాజీవ్ కుమార్ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. అదే సమయం నుంచి దేశ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఏప్రిల్ 18న ఏపీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నాలుదో దశలో మే 13న ఏపీలో ఎన్నికలు నిర్వహించి, జూన్ 4వ తేదీన ఓట్లు లెక్కించి విజేతలను ప్రకటిస్తారు. పీలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎవరైనా కార్యక్రమాలు నిర్వహించాలంటే అనుమతులు తీసుకోవాలని ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. సువిధా యాప్ (÷ుబీలతిటరజీ ం÷ఔ) ద్వారా అనుమతులు తీసుకోవాలని.. 392 ధరఖాస్తులు అందగా, వాటిలో 10 ఈసీ పరిధిలోనివి అని ఇటీవల ఆయన తెలిపారు. మిగతా కేసులు జిల్లా ఎన్నికల అధికారుల పరిధిలో ఉన్నాయి. ఎం.సి.సి (ఓఅఅ) ఉల్లంఘనకు సంబందించిన ఫిర్యాదులను సీ విజిల్ యాప్ (ఇుఎఉఎఓ జూ) ద్వారా నమోదు చేసుకున్న 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు దాదాపు 1,173 ఫ్లయింగ్ స్క్వాడ్లు పనిచేస్తున్నాయని.. సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకూ 1,307 ఫిర్యాదులు అందగా, వాటిలో 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించినట్లు వెల్లడించారు. సి-విజిల్ పిర్యాధుల్లో 95 శాతం మేర పరిష్కరించే లక్ష్యంతో పనిచేస్తాం. ఈ యాప్ ను అందరూ వినియోగిస్తూ ఎం.సి.సి. ఉల్లంఘనలను నియంత్రించేందుకు సహకరించాలని రాష్ట్ర ప్రజలను ఆయన కోరారు.

# జగన్ దుర్మార్గ పాలనకు అంతం పలకాలి

**పిఠాపురం:** జగన్ దుర్మార్గమైన పాలనను అంతం చేయడానికే తెదేపా, భాజపా, జనసేన కలిశాయని పవన్ కల్యాణ్ అన్నారు. తాను పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచి శనివారం జనసేనాని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తన కోసం సీటు త్యాగం చేసిన తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మకు ధన్యవాదాలు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా మీరంతా నాతో కలసి నడవండని పిలుపునిచ్చారు. ఇక్కడి నుంచి పోటీ చేస్తానని కలలో కూడా అనుకోలేదు. అధికారంలోకి రాగానే ఆసుపత్రులన్నీ బాగు చేస్తాం. నా సన్నిహితులతో మాట్లాడి పిఠాపురంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పెట్టిస్తా. ఓడినా దశాబ్దం నుంచి ఒంటరి పోరాటం చేస్తున్నా. పిఠాపురంలో ఇల్లు కట్టుకుంటా. అన్ని మతాలు, విశిష్ఠత కలిగిన నేల ఇది. నన్ను ఓడించడానికి చిత్తూరు జిల్లా నుంచి మిథున్‌రెడ్డి వచ్చారు. మండలానికి ఓ నాయకుడిని పెట్టారు. రూ.వందల కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యారు. వైకాపా వ్యతిరేక ఓటు చీలనివ్వకూడదనే కూటమిగా వచ్చాం. కూటమి కావాలో.. వైకాపా కావాలో.. ఆలోచించుకోండి అన్నారు. మద్యం ఆదాయంలో రోజుకు రూ.24 కోట్లు జగన్‌కే వెళ్తున్నాయని ఆరోపించారు జనసేన అధినేత పవన్ ఎన్నికల ప్రచార యాత్రలో భాగంగా శనివారం పిఠాపురం చేరుకున్నారు. గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్ లో ల్యాండ్ అయ్యారు. పవన్ ను చూసేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. పవన్ కు కాకినాడ ఎంపి అభ్యర్థి తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్,కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, మాధురి నాయుడు, డాక్టర్ పిల్లా శ్రీధర్,వర్మ తనయుడు గిరీష్ లు స్వాగతం పలికారు. అనంతరం పవన్ కారులోంచి అభివాదం చేశారు. అనంతరం రోడ్డు మార్గంలో గొల్లప్రోలు నుంచి పి దొంతమూరు గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్చార్జ్ వర్మ నివాసానికి వెళ్ళారు. ఈ క్రమంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు ఎన్నికల ప్రచారంలో తొలిరోజే చేదు అనుభవం ఎదురైంది. శ్రీపాద క్షేత్రంలో పవన్ కళ్యాణ్ వారాహి వాహనం పూజలకు అనుమతి లభించలేదు. పురూహుతిక అమ్మవారి ఆలయంలో పవన్ ప్రచార వాహనానికి పూజలు రద్దు చేశారు. నిర్ణీత గడువులోగా ప్రచార వాహనం వారాహికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోలేదని పోలీసుల వాదనగా ఉంది. పవన్ బహిరంగ సభ ఉండటంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. న్నికల ప్రచార పర్యటనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ టిడిపి ఇంచార్జ్ వర్మ ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గొల్లప్రోలు నుంచి పి. దొంతమూరు వరకూ జనసైనికులు పవన్ కు ఘన స్వాగతం పలికారు. జనసేన, టిడిపి శ్రేణులతో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. టీడీపీ నేత వర్మ కుటుంబ సభ్యులు పవన్ ను సత్కరించారు. ఆయన మాతృమూర్తి అలివేలు మంగ పద్మావతి నుంచి పవన్ కళ్యాణ్ ఆశీర్వాదం తీసుకున్నారు. అదే సమయంలో వర్మని, సుజయ్ కృష్ణ రంగారావుని పవన్ కళ్యాణ్ సత్కరించారు. తొలి విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా పవన్ పిఠాపురంలో 5 రోజులు పర్యటించనున్నారు.

# జగన్ బస్సుయాత్ర తుస్సు

**అమరావతి:** జగన్ చేపడుతున్న బస్సు యాత్ర తుస్ యాత్ర అయిందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దేవినేని ఉమ దెప్పిపొడిచారు. వైసీపీ ప్రభుత్వం చేస్తానన్న మద్యపాన నిషేధం హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ విషయంల ప్రజలకు ఎందుకు చెప్పడం లేదన్నారు. సీఎం జగన్‌రెడ్డి చెప్పిన అబద్దాలే మళ్లీ మళ్లీ చెప్పి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దేవినేని ఉమ అన్నారు. తాను ఫ్టస్ట్ క్లాస్ స్టూడెంట్ అని శాసనసభలో జగన్ చెప్పారని... అబద్దాలు చెప్పడంలో జగన్ ఫస్ట్ క్లాస్ స్టూడెంటేనని ఎద్దేవా చేశారు. అబద్దాల్లో జగన్ పీహెచ్డీ తీసుకున్నారని సెటైర్లు గుప్పించారు. కరెంట్ ఛార్జీలు తగ్గిస్తానని తొమ్మిది సార్లు కరెంట్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. తాడేపల్లి ప్యాలెస్‌కు ఇసుక, మద్యం మాఫియా సొమ్మును తరలించారని దేవినేని ఉమ ఆరోపించారు. శాండ్, ల్యాండ్, మైన్, వైన్ మాఫియాలతో డబ్బులు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఏడు లక్షల మంది పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లారని చెప్పారు. అమ్మఒడిలో ఏడు లక్షల మందికి కోత విధించారని అన్నారు. కమీషన్ల కోసమే నాడు-నేడు చేపట్టారని అన్నారు. జగన్ ఇద్దరు చెల్లెళ్లు రక్షా బంధన్ కట్టేందుకు సిద్ధంగా లేరన్నారు. ఈ కేసుపై ఇప్పుడు సీబీఐ విచారణ వద్దంటున్నారని చెప్పారు. బాబాయ్ హంతకులకే మళ్లీ టిక్కెట్ ఎలా ఇస్తారని చె÷-లలెళ్లు ప్రశ్నిస్తున్నారన్నారు. చాలా చోట్ల ప్యాలెస్సులు కట్టుకున్న జగన్ పేదవాడా..? అని నిలదీశారు. దేశంలో అత్యధిక ఇన్‌కంట్యాక్స్ కట్టేది సీఎం జగనేనని అన్నారు. జగన్ పేదవాడు.. మేం పెత్తందారులమా..? అని నిలదీశారు.

# దానం నాగేందర్‌పై వేటు వేయండి

## ఇంకెన్ని రోజులు నాన్చుతారు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్:** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన దానం నాగేందర్‌పై అసెంబ్లీ స్పీకర్ అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. శనివారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... మార్చి 18వ తేదీన సభాపతిని కలిసి దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ వేసినట్లు తెలిపారు. దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి వెళ్లారని తాము ఫిర్యాదు చేసి12 రోజులైనా స్పీకర్ నుంచి స్పందన లేదన్నారు. అదనపు అఫిడవిట్ సమర్పించేందుకు సభాపతిని కలిసేందుకు వెళ్తే ఎవరూ లేరని చెప్పారు. కార్యదర్శిపై ఏం ఒత్తిళ్లు ఉన్నాయో... కానీ ఆయన కూడా అందుబాటులో లేరన్నారు. కాంగ్రెస్ లోక్ సభ అభ్యర్థిగా దానం నాగేందర్ పేరును అధికారికంగా ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. సభాపతి నిర్ణయం తీసుకొని దానం నాగేందర్‌పై అనర్హతా వేటు వేస్తే దేశం మొత్తం హర్షిస్తారని చెప్పారు. నాగేందర్‌పై చర్య తీసుకుంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వారవుతారని అన్నారు. సభాపతి వెంటనే స్పందించాలని.. చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. నలుగురు ఎమ్మెల్యేలం పోతే కనీసం తమ వినతిపత్రం తీసుకోరా? అని ప్రశ్నించారు. సభాపతి చర్య తీసుకోకపోతే న్యాయస్థానానికి వెళ్తామని హెచ్చరించారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం ఆ నేతలకు అంత సిగ్గుచేటు ఇంకోటి ఉండదన్నారు. కడియం శ్రీహరి పార్టీ మారడం నమ్మించి గొంతు కోయడమేనని అన్నారు. ప్రజలు ఆయనను చీకొట్టే పరిస్థితికి వచ్చారని చెప్పారు. ఇకపోతే ఎవరూ కడియంలా మాత్రం పార్టీకి ద్రోహం చేయరన్నారు. ఆయన వరంగల్ వెళ్తే ప్రజలు తరిమి కొట్టే పరిస్థితి ఉందన్నారు.

# జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

## - ఐఎఫ్ టియు జిల్లా కార్యదర్శి ఎం.సుధాకర్.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 30**

: రాష్ట్రవ్యాప్తంగా పెండింగులో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్ టియు జిల్లా కార్యదర్శి ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం మోపాల్ ఎంపీడీఓ కార్యాలయ ఇన్చార్జికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎం.సుధాకర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామ పంచాయతీల్లో వేలాదిమంది మల్టీపర్పస్ కార్మికులకు సుమారు 5, 6 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అతి తక్కువ వేతనాలతో పస్తులు ఉంటూ, పని చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతి నెల వేతనాలు రాకపోవడంతో ఇంటి అద్దెలు, కిరాణా సరుకులు, పిల్లలకు చదువులు, వైద్యం విషయంలో కూడా అవస్థలు పడుతున్నారని అన్నారు. గ్రామపంచాయతీలో డబ్బులు లేవని, స్పెషల్ ఆఫీసర్ సంతకాలు కాలేదని, రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వట్లేదని ఇలా అనేక రకాల సాకులతో కార్మికుల కడుపులు కాల్చడం ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల కోసం ప్రత్యేక నిధి, బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. నెలలుగా పెండింగులో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనియెడల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ సాయగౌడ్, జీపీ కార్మికులు జి.శేఖర్, టి.లక్ష్మణ్, జి.గంగాధర్, జి.లక్ష్మణ్, రాములు తోకల రాజు, విటల్, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు.

## - నూతన కార్యవర్గానికి జడ్జి అభినందన.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 30:** బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన కార్యవర్గం శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత ను మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే ఇతర న్యాయమూర్తులు కనకదుర్గ, టి. శ్రీనివాస్, చిరంజీ ఆశా లత, శ్రీకాంత్ బాబు, శ్రీనివాసరావు లను కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనటువంటి అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వసంతరావు, ఉపాధ్యక్షులు పి రాజు, కోశాధికారి దీపక్, స్పోర్ట్స్ సెక్రటరీ ఆయుబ్, లైబ్రరీ సెక్రటరీ పిల్లి శ్రీకాంత్, మహిళా ప్రతినిధి కవిత రెడ్డి, కార్యవర్గ సభ్యులు చక్రవర్తి, శివాజీబోస్లే, డి. రవి, లక్ష్మీనారాయణ , అరేటి. నారాయణ, రజిత లను న్యాయమూర్తులు అందరూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్నికలలో ప్రలోభాలపై గట్టి నిఘా.

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 30**



ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ఎలాంటి ప్రలోభాలకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు సంబంధిత అధికారులు గట్టి నిఘా కొనసాగిస్తూ అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ నేతృత్వంలో జరిగిన జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, ఇతర సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలలో వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతి ఖర్చును లెక్కించవలసి ఉంటుందని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై గట్టి నిఘా ఉంచాలని, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించే కేసులు నమోదు చేసి, ప్రలోభాల కోసం వినియోగించే నగదు, వస్తువులు, మద్యం నిల్వలు తదితర వాటిని స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఇందుకు నియమించిన ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, వీడియో వీవింగ్ బృందాలు, సెక్టోరల్ అధికారులు సమర్థవంతంగా పని చేయాలని కోరారు. ఆబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బందితో ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, చెక్ పోస్ట్ ల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, 10 లక్షలు పైగా డబ్బు పట్టుపబడిన సందర్భంలో ఆదాయ శాఖ అధికారులకు సమాచారమందించాలన్నారు. గిఫ్ట్ వస్తువుల రవాణాపై వాణిజ్య పన్నుల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. తనిఖీలకు సంబంధించిన వివరాలను నిర్ణీత నమూనాలో రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని హితవు పలికారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు వాటిని పరిశీలించేందుకు అవకాశం ఉన్నందున రికార్డుల నిర్వహణ సక్రంగా చేపట్టాలని సూచించారు. అనుమానాస్పద ఆన్ లైన్ బ్యాంకు లావాదేవీలపై రోజు వారీగా నివేదిక అందించాలని, ఎక్కువ మొత్తంలో నగదు బదిలీ జరిగే ఖాతాలను గుర్తించి వివరాలు సమర్పించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రావును ఆదేశించారు. అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వహించాలని ఆబ్కారీ అధికారులకు సూచించారు. వైన్ షాప్ లలో సి.సి కెమెరాలు పనిచేసేలా పర్యవేక్షణ చేయాలని, గతేడాది మార్చ్, ఏప్రిల్, మే నెలల్లో జరిగిన మద్యం అమ్మకాల వివరాలను ఏ.ఆర్.ఓలకు అందించాలని, దీనివల్ల ప్రస్తుతం మద్యం అమ్మకాలలో ప్రలోభాల పర్వాన్ని గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులలో కార్గో సేవల ద్వారా, రైల్వే ద్వారా ఏవైనా వస్తువులను ఎన్నికలలో ప్రలోభాల కోసం పంపిస్తున్నారనే అనుమానం కలిగితే, వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ఆర్టీసీ, రైల్వే అధికారులకు సూచించారు. ముఖ్యంగా చీరలు, హ్యాండ్ బ్యాగులు, టోపీలు, టీ-షర్టులు వంటి వాటిని పెద్ద మొత్తంలో కార్గో సేవలు వంటి వాటి ద్వారా దిగుమతి చేసుకునే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు.

సీ.పీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండి విస్తృత తనిఖీలు చేస్తూ పలుచోట్ల నగదు తో పాటు మద్యాన్ని పట్టుకున్నామని అన్నారు. గత శాసన సభ ఎన్నికల తరహాలోనే ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలలోనూ ఆయా శాఖల అధికారులు చక్కటి సమన్వయంతో సమిష్టిగా కృషి చేస్తూ అక్రమ నగదు, మద్యం, కానుకల పంపిణీ వంటి ప్రలోభాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి.

## - సీఎం రేవంత్ రెడ్డికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, మార్చి 30**



రాష్ట్రంలోని జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శనివారం హైదరాబాద్ లోని సచివాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, కార్యదర్శులు ఎన్కె. సలీమ, బి. జగదీశ్వర్, ఈ చంద్రశేఖర్ తదితరులు సీఎంను కలిశారు ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల ఇండ్లస్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అన్ని కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లో పనిచేసేలా కొత్త హెల్త్ కార్డుల విధానం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అక్రిడిటేషన్ కార్డులను చూపిస్తే సచివాలయంలోకి అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ మీడియా అకాడమీలో అన్ని పత్రికల సంపాదకులను నియమించాలనీ, అలాగే జీవో 239 ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యూనియన్లను మీడియా అకాడమీ సభ్యత్వం కల్పించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మహిళా జర్నలిస్టులు, చిన్న, మధ్య తరహా పత్రికల సమస్యలను పరిష్కారించాలని సూచించారు ఇందుకు స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల తర్వాత జర్నలిస్టుల సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ఆదాయపు పన్నుశాక నోటీసులతో

# కాంగ్రెస్ ఆగ్రహం

### విపక్ష పార్టీలను అణచివేసే కుట్ర అని చిదంబరం ఆరోపణ

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆదాయపు పన్ను అంశంలో కాంగ్రెస్ కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. 2017-18, 2020-21 మదింపు సంవత్సరాలకు సంబంధించి పెనాల్టీ, వడ్డీ వసూలు పేరిట రూ.1,823 కోట్లు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు పంపారు. దీంతో నిధులు లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్‌కు ఊరట దక్కలేదు. ఈ క్రమంలో సుప్రీంలో ఐటిశాఖ తీరుపై కేసు వేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం రాజకీయ పార్టీలను హెచ్చరించారు. ఎన్నికల బాండ్ల ద్వారా భాజపా రూ.8,250 కోట్లు సంపాదించింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీపై ఆ ప్రభుత్వం రూ.135 కోట్ల ఫైన్ వేసింది. ఇది రాజకీయ పార్టీలు, ప్రజలకు ఓ హెచ్చరిక. భాజపా అన్ని పార్టీలను నిర్వీర్యం చేయాలని భావిస్తోంది. దాని అజెండా అయిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అసలు ఉద్దేశం 'ఒకే దేశం- ఒకే పార్టీ' అని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి ఐటీ విభాగం నుంచి వరుసగా నోటీసులు వస్తున్నాయి. 2017 నుంచి 2021 మధ్య కాలానికి ఆదాయపు పన్ను(ఐటీ) విభాగం చేపట్టిన పునఃపరిశీలన ప్రక్రియను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్లను ఇటీవల దిల్లీ హైకోర్టు కొట్టేసిన విషయం తెలిసిందే. ఆ వెంటనే ఆయా మదింపు సంవత్సరాలకు పెనాల్టీ, వడ్డీ వసూలు నిమిత్తం హస్తం పార్టీకి రూ.1,823 కోట్లు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు అందాయి. అంతకుముందు 2014-15 నుంచి 2016-17 మధ్య కాలానికి సంబంధించి ఆదాయపు పన్నుశాఖ చేపట్టిన పునఃపరిశీలనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కూడా హైకోర్టు తిరస్కరించింది. దీనికి సంబంధించి ఇప్పటికే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల నుంచి రూ.135 కోట్లను ఐటీ విభాగం రికవరీ చేసింది.

# హస్తం"కు చిక్కిన కామారెడ్డి బల్దియా.

## - చైర్మన్ పై నెగ్గిన అవిశ్వాసం.



**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి: మార్చి 30:**

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ గడిచిన మూడు నెలల్లోనే స్థానిక సంస్థల్లోనూ తమ పట్టు కోల్పోతుంది. వారం రోజుల క్రితం ఆర్మూర్ మున్సిపల్ ను కోల్పోగా, అదే దారిలో కామారెడ్డి బల్దియాకు బిఆర్ఎస్ దూరం అయింది. బిఆర్ఎస్ కు చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి పై అవిశ్వాసం నెగ్గింది. దీనితో కామారెడ్డి బల్దియా కాంగ్రెస్ చేతికి చిక్కింది. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్ పర్సన్ పై పెట్టిన అవిశ్వాసం పై కౌన్సిలర్లతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. 49 మంది సభ్యులు ఉన్న కౌన్సిల్లో అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యులు అవసరం ఉంది. 37 మంది సభ్యులు హాజరై తమ మద్దతును తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కు చెందిన పదిమంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, మున్సిపల్ కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. 37 మంది సభ్యులు మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి కి వ్యతిరేకంగా చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో అధికారులు అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు. ఇంఛార్జి చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన గడ్డం ఇందుప్రియను నియమించారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చైర్మన్ ఎన్నిక జరుపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కాగా కామారెడ్డి బల్దియా కాంగ్రెస్ హస్తగతం కావడానికి షబ్బీర్ అలీ కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



# ఓడిపోయే పార్టీ నుంచి పోటీ వద్దనుకున్నాం

హైదరాబాద్: పార్టీ మారుతున్న తనను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. తాను భారాసలో ఉన్న పదేళ్లలో ఎలాంటి తప్పు చేయలేదని, అవినీతి అక్రమాలకు పాల్పడలేదని చెప్పారు. చాలా మంది పార్టీని, ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలోని తన నివాసంలో ఆయన స్టేషన్‌ఘన్‌పూర్ నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన కుమార్తె కడియం కావ్య కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడారు. "అరూరి రమేశ్, పసునూరి దయాకర్ పార్టీ మారినప్పుడు ఎవరూ మాట్లాడలేదు. ఇప్పుడు నన్ను అందరూ విమర్శిస్తున్నారు. ఎంత ఎక్కువగా విమర్శలు వస్తే అంత ఎక్కువ బలం ఉందని అర్థం. అవకాశాలు అందరికీ వస్తాయి.. వాటిని ఏవిధంగా ఉపయోగించుకున్నాం అనేదే ముఖ్యం. భారాస పార్టీ ఎవరికీ అన్యాయం చేయలేదు. అరూరి రమేశ్ వద్దు అంటేనే కావ్యకు టికెట్ ఇచ్చారు. పార్టీ ఒడిదుడుకుల్లో ఉన్నా పోటీ చేయాలని అనుకున్నాం. కానీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాయకుల నుంచి ఎలాంటి సహకారం లభించలేదు.

**మీ అందరి అభిప్రాయం మేరకే నిర్ణయం**

నా వెంట ఉన్న నాయకులు, కార్యకర్తలు 10 ఏళ్లు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లుగానే ఉన్నారు. ఇప్పుడు అధికారం లేక ప్రతిపక్షంలో ఉన్నాం. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని ఇంకా ఎంతో అభివృద్ధి చేయాలి. మొదటిసారి బరిలో దిగుతున్న కడియం కావ్యను ఓడిపోయే పార్టీ నుంచి పోటీ వద్దు అనుకున్నాం. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయాలంటూ పిలుపువచ్చింది. మీ అందరి అభిప్రాయం మేరకే నా నిర్ణయం ఉంటుంది. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో నాపై ఒక్క కేసు కూడా లేదు. నన్ను ప్రశ్నించే హక్కు ఒక్క స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలకు మాత్రమే ఉంది. నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా.. నిండు మనసుతో ఆదరించాలి" అని కడియం కోరారు.

వేగుచుక్క VC NEWS

ఆదివారం 31 మార్చి 2024

# నిజమైన 'లెజెండ్' మావా..!

బాలయ్య కెరీర్‌లో మూడు సినిమాలు చాలా స్పెషల్ మరియు చాలా పెద్ద హిట్ అనడంలో సందేహం లేదు. నందమూరి బాలకృష్ణ, బోయపాటి కాంబోలో వచ్చిన సింహా, లెజెండ్ మరియు అఖండ సినిమాలు భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. ఈ మూడు సినిమాలు కూడా బాక్సాఫీస్ వసూళ్ళ విషయంలో రికార్డుల మోత మోగించిన విషయం తెల్సిందే. బాలయ్య కెరీర్ లో మూడు సినిమాలు చాలా స్పెషల్ మరియు చాలా పెద్ద హిట్ అనడంలో సందేహం లేదు. లెజెండ్ సినిమా 10 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు పెద్ద ఎత్తున ఈవెంట్ ను నిర్వహించారు. బాలకృష్ణ, బోయపాటితో పాటు హీరోయిన్ ఇంకా పలువురు సినీ ప్రముఖులు మరియు సినిమాకు వర్క్ చేసిన నటీ నటులు పాల్గొన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. మా లెజెంట్ లో నటించినందుకు జగపతి బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేయాలి. ఆయన లెజెండ్ తర్వాత చాలా విభిన్నమైన పాత్రలు, సినిమాలు చేశాడు. సినిమాలో ఒక సన్నివేశంలో గుర్రం తో గాజులు పగలగొట్టడం మీరు చూశారు. ఆ సన్నివేశంకు డూప్ లేకుండా నేనే చేశాను. దర్శకుడు బోయపాటి డూప్ తో ఆ సీన్ చేయాలని మొదట అనుకున్నాడు. కానీ నేను సొంతంగానే ఆ సీన్ చేస్తాను అన్నాను. కొందరు యంగ్ హీరోలు కూడా చిన్న చిన్న యాక్షన్ సన్నివేశాలకు డూప్ లను వాడుతూ ఉంటారు. కానీ మా బాలయ్య అంత పెద్ద యాక్షన్ సన్నివేశానికి కూడా డూప్ లేకుండా సొంతంగా చేశాడు.. అందుకే మా బాలయ్య నిజమైన లెజెండ్ మావా.. అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. త్వరలో బాలయ్య, బోయపాటి కాంబోలో నాల్గవ సినిమా పట్టాలెక్కబోతుంది. వీరి కాంబో మూవీ కోసం ఫ్యాన్స్ కూడా చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.





# లాస్ట్ వరకు ఛేంజ్ చేస్తూనే..

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ తన కామెడీ టైమింగ్ తో మరోసారి అలరించారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు రెండేళ్ల క్రితం వచ్చి బ్లాక్ బస్టర్ అయిన డీజే టిల్లు మూవీతో యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ ఎలాంటి క్రేజ్ సంపాదించుకున్నారో అందరికీ తెలిసిందే. సిద్ధు యాక్టింగ్, యాటిట్యూడ్ తో పాటు స్టైల్ కు అంతా ఫిదా అయిపోయారు. ఇప్పటికీ డీజే టిల్లు సాంగ్స్ వినిపిస్తూనే ఉంటాయి. తాజాగా ఈ సినిమా సీక్వెల్ టిల్లు స్క్వేర్ రిలీజైన విషయం తెలిసిందే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం.. మంచి టాక్ దక్కించుకుని దూసుకుపోతోంది. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ తన కామెడీ టైమింగ్‌తో మరోసారి అలరించారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. టిల్లు గాడి పంచ్ డైలాగ్స్ మంచి గా వర్కౌట్ అయ్యాయని అంటున్నారు. సిద్ధు వన్ మెన్ షోగా కొనియాడుతున్నారు. ఈ సినిమా ఫుల్ ఫన్ థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఇస్తుందని చెబుతున్నారు. ఈ మూవీ లో హీరోగా నటిస్తూనే రచయితగా కూడా సిద్ధు జొన్నలగడ్డ వ్యవహరించిన విషయం తెలిసిందే. అయితే కొందరు హీరోలు.. తమ సినిమాల స్క్రిప్ట్ విషయంలో జోక్యం చేసుకుంటారని వార్తలు వస్తుంటాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సిద్ధుకు కూడా ఇదే ప్రశ్న ఎదురైంది. మూవీల్లో ఎంతవరకు జోక్యం చేసుకుంటారని అడగ్గా.. టిల్లు స్క్వేర్ మూవీకి తానే రచయిత, కాబట్టి ప్రతి విషయంలో తాను జోక్యం చేసుకున్నట్లు తెలిపారు సిద్ధు. మూవీ లాస్ట్ వరకు ఛేంజెస్ చేశానని చెప్పారు. మధ్యలో డైలాగ్స్ కూడా యాడ్ చేశానని వెల్లడించారు. ఈ సినిమా విషయంలో పూర్తిగా రైటింగ్, మేకింగ్ లో కంప్లీట్ ఫ్రీడమ్ తీసుకున్నానని, కొన్ని సీన్లు రీషూట్ కూడా చేశామని తెలిపారు. తన అప్ కమింగ్ మూవీల్లో కేవలం నటిస్తున్నానని, జోక్యం చేసుకోనని క్లారిటీ ఇచ్చారు. సాధారణంగా ఇండస్ట్రీలోని ప్రతి దర్శకుడికి సినిమాలోని క్యారెక్టర్ పై పెర్ఫెక్ట్ విజన్ ఉంటుందని తెలిపారు. దాన్ని హీరో ఫాలో అవ్వాలని, నేను కూడా అదే చేస్తున్నట్లు చెప్పారు. తన కొత్త చిత్రాల విషయంలో ఫ్యాన్స్ అభిప్రాయాలను లెక్కలోకి తీసుకుని అడుగులేస్తున్నట్లు చెప్పారు సిద్ధు. నీరజ కోన డైరెక్షన్ లో ప్యూర్ లవ్ స్టోరీ చేస్తున్నానని స్పష్టం చేశారు. ఇండస్ట్రీలో రెమ్యునరేషన్ పరంగా బెస్ట్ పొజిషన్ లోనే ఉన్నట్లు వెల్లడించారు. కానీ ఎంతనేది చెప్పలేదు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో కూడా సిద్ధు మరో సినిమా చేస్తున్నారు. మరి స్టార్ బాయ్ కొత్త చిత్రాలు ఎలా ఉంటాయో చూడాలి.



# కల్కీ వాయిదా వేస్తున్నారా?

ఆ సమయంలో సినిమా రిలీజ్ అన్నది సరైన సమయం కాదని తాజాగా చిత్ర వర్గాల్లో చర్చకొచ్చిందిట. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898' ఇప్పటికే రిలీజ్ తేదిని ప్రకటించిన సంగతి తెలిసిందే. మే 9న వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేస్తున్నట్లు అధికారిక ప్రకటనా వచ్చేసింది. ఎట్టి పరిస్థితుల్లో ఆ తేదీకి వచ్చేస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేసాయి. కానీ ఇప్పుడా సమీకరణాలు మారుతున్నట్లు తాజాగా అందుతోన్న సమాచారం. ప్రస్తుతం ఏపీలో ఎన్నికల వేడి ఎలా ఉందో తెలిసిందే. ఇప్పటికే అన్ని పార్టీలు ప్రచారం పనుల్లో బిజీ అయ్యాయి. చంద్రబాబు నాయుడు..పవన్ కళ్యాణ్ ఎవరికి వారుగా ప్రచారంలో బిజీ అయ్యారు. అనసూయ అధికారిక పార్టీ కూడా మొన్నటి నుంచి ప్రచారం మొదలు పెట్టేసింది. ఇప్పుడు జనాలంతా ఆ పార్టీల వెనుకే కనిపిస్తున్నారు. మే 9 అంటే ఎన్నికల తేదికి అతీ సమీపంలో ఉంది. ఆ సమయంలో సినిమా రిలీజ్ అన్నది సరైన సమయం కాదని తాజాగా చిత్ర వర్గాల్లో చర్చకొచ్చిందిట. ప్రేక్షకులంతా ఎన్నికల హడావుడి లో ఉంటారు. అప్పుడు రిలీజ్ చేస్తే ప్రేక్షకులు థియేటర్ కి వచ్చి చూసే సన్నివేశం ఉంటుందా? అన్న సందేహం మొదలైనట్లు కనిపిస్తోంది. ఇప్పటికే థియేటర్లకి జనాలు రావడం లేదనే బెంగ ఉంది. ఇలాంటి కన్ ప్యూజన్ నడుమ రిలీజ్ అయితే సినిమాకి నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారుట. దీంతో రిలీజ్ తేదీ మార్చే ప్లాన్ లోఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయం డిస్ట్రిబ్యూటర్లు అందరికీ చెవిన వేసినట్లు తెలిసింది. మే 9 గనుక కోల్పోతే మళ్లీ ఆగస్టులోనే రిలీజ్ ఉంటుందని తెలిసింది. సరిగ్గా 'పుష్ప-2' రిలీజ్ కి ముందుగానీ..తర్వా త గానీ రిలీజ్ అయ్యేలా ప్రత్యామ్నాయం వెతుకుతున్నారుట. అదే గనుక జరిగితే బాక్సాఫీస్ వద్ద వార్ తప్పదు. హిందీ మార్కెట్లో బన్నీ..ప్రభాస్ కి మంచి క్రేజ్ ఉంది. పుష్పకి భారీ ఎత్తున వసూళ్లు వచ్చినవన్నీ నార్త్ మార్కెట్ నుంచే. ఇక డార్లింగ్ హిందీ మేనియా కొంత కాలం గా కొనసాగుతూనే ఉంది. రెండు సిని మాలు రిలీజ్ అయితే ఇబ్బంది ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. థియేటర్ల సర్దుబాటు నుంచే యుద్ధం మొదలవుతుం ది. ఆ తర్వాత అది ఫ్యాన్ వార్ గానూ దారి తీస్తుంది. రెండు సినిమాల ఓపెనింగ్‌లు..లాంగ్ రన్ వసూళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. కల్కి ఆగస్టుకి వెళ్తే గనకు సమస్యలు ఉత్పన్నం అవుతాయి.





# 'ఓటెయ్యండి లేదా చచ్చిపోండి'

టాలీవుడ్‌లో వైవిధ్యమైన కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న హీరో నారా రోహిత్ టాలీవుడ్‌లో వైవిధ్యమైన కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న హీరో నారా రోహిత్. ఇటీవల కాలంలో సినిమాలకు కాస్త దూరంగా ఉన్న టాలెంటెడ్ యాక్టర్.. దాదాపు ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు 'ప్రతినిధి 2' చిత్రంతో కంబ్యాక్ ఇవ్వడానికి రెడీ అయ్యారు. ఇప్పటికే టైటిల్ అనౌన్స్ మెంట్ తోనే ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా ఈ మూవీ టీజర్ ను ఆవిష్కరించారు. నారా రోహిత్ కెరీర్ లో ఎప్పటికీ గుర్తుండి పోయే చిత్రాల్లో 'ప్రతినిధి' ఒకటి. 2014లో వచ్చిన ఈ పొలిటికల్ డ్రామా మంచి విజయం సాధించింది. ఇప్పుడు అదే ఫ్రాంచైజీలో రెండో సినిమాగా "ప్రతినిధి 2" తెరకెక్కుతోంది. ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తపు దర్శకత్వంలో ఈ పొలిటికల్ థ్రిల్లర్ రూపొందుతోంది. ఈరోజు (మార్చి 29) శుక్రవారం మూవీ టీజర్ ను మెగాస్టార్ చిరంజీవి లాంచ్ చేసి చిత్ర బృందానికి బెస్ట్ విషెస్ అందజేశారు. రాష్ట్ర అభివృద్ధి, అప్పులు వంటి పొలిటికల్ అంశాలను ప్రస్తావిస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో హీరో నారా రోహిత్ ఒక టీవీ ఛానెల్‌లో పనిచేసే నిజాయితీ గల న్యూస్ రిపోర్టర్ గా కనిపించారు. రాజకీయ నాయకుడైన అజయ్ ఘోస్ ను ఇంటర్వ్యూ చేస్తూ, రాష్ట్ర అప్పుల గురించి ప్రశ్నిస్తున్నాడు. దానికి అతను 5 లక్షల కోట్లు అప్పు ఉందని బదులిస్తాడు. ప్రియుణ్ణి



ఊహించుకునా! 'అంత అప్పు తీర్చాలంటే ఎంత టైం పడుతుంది సార్' అని అడగ్గా.. అభివృద్ధి జరిగితే అవి తీరడానికి ఎంతో సమయం పట్టదని సమాధానమిస్తాడు. దీనికి వెంటనే 'అభివృద్ధి ఎక్కడుంది సార్?' అంటూ నారా రోహిత్ నవ్వుతూ ప్రశ్నించడంతో ఈ టీజర్ ఆసక్తికరంగా మారుతుంది. చివర్లో "ఇప్పటికైనా కళ్లు తెరవండి, ఒళ్ళు విరిచి బయటకు వచ్చి ఓటు వెయ్యండి. లేదంటే ఈ దేశం వదిలి వెళ్లిపోండి. అదీ కుదరకపోతే చచ్చిపోండి" అంటూ సీరియస్ గా హెచ్చరిస్తూ, ఓటు విలువను తెలియజెప్పడం హైలైట్ గా నిలిచింది. టీజర్ లో 'జనం కోసం బ్రతికితే చచ్చాక కూడా జనంలోనే బ్రతికి ఉంటాం' వంటి డైలాగ్స్ ఆకట్టుకుంటు న్నాయి. 'పైన కూర్చొని నీతులు ఎన్నైనా చెప్తావ్.. మేము ఖర్చు పెట్టిందంతా ఎవరిస్తారు? వాడా.. వాడెమ్మ మొగుడా' అని రఘుబాబుతో పలికించడం ద్వారా ప్రస్తుత రాజకీయ నాయకులపై సెటైర్లు వేస్తున్నట్లు అనిపిస్తుంది. ఇందులో యాక్షన్ పాళ్లు కూడా ఎక్కువే అని టీజర్ లోనే హింట్ ఇచ్చారు. మొత్తం మీద సమకాలీన రాజకీయాల కు అద్దంపట్టే అంశాలతో వచ్చిన 'ప్రతినిధి 2' ఇంటెన్స్ టీజర్ అందరినీ అలరించడమే కాదు, ఆలోచింపజేస్తుంది. న్యూస్ రిపోర్టర్ పాత్రలో నారా రోహిత్ మెప్పిం చారు. జర్నలిస్ట్ మూర్తి తన రైటింగ్, టేకింగ్‌తో ఆకట్టుకున్నారు. ఇంటర్వ్యూ ఎపిసోడ్, ఓటు హక్కు - ఓటరు బాధ్యతల గురించిన సీక్వెన్స్ చాలా బాగుంది. మరికొన్ని రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ టీజర్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారే అవకాశం ఉంది.అనసూయ మహతి స్వర సాగర్ కంపోజ్ చేసిన బ్యాగ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నాని చమిడిశెట్టి కెమెరా పనితనం చక్కగా ఉంది. ప్రొడక్షన్ డిజైన్ గ్రాండ్ గా అనిపించింది. కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేసిన ఈ చిత్రానికి రవితేజ గిరిజాల ఎడిటర్ గా వ్యవహరించారు. వానర ఎంటర్‌టైన్‌మెంట్స్, రానా ఆర్ట్స్ బ్యానర్‌లపై కుమార్‌రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ప్రతినిధి 2' చిత్రంలో నారా రోహిత్ తో పాటుగా సిరి లెల్ల, దినేష్ తేజ్, సప్తగిరి, జిషు సేన్‌గుప్తా, సచిన్ ఖేడేకర్, తనికెళ్ల భరణి, ఇంద్రజ, శ్రీ, ఉదయ భాను, అజయ్ గోష్, అజయ్, ప్రవీణ్, పృథ్వీ రాజ్, రఘుబాబు, రఘు కారుమంచి తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని 2024 సమ్మర్ స్పెషల్ గా ఏప్రిల్ నెలలో రిలీజ్ చేసేనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఎన్నికలకు ముందు ప్రేక్షకుల ముందుకి రాబోతున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని సాధిస్తుందో చూడాలి.

# ఒకటి చెబితే అది జనాల్లోకి మరోలా!

తాజాగా ఈ ప్రచారాలన్నింటిని అనసూయ ఖండించింది. తాను తుమ్మినా..దగ్గినా కాంట్రవర్సీ చేస్తున్నారంటూ అసహనాన్ని వ్యక్తం చేసింది యాంకర్ కం నటి అనసూయ ఇటీవలే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అదేశిస్తే పార్టీ తరుపున ప్రచారం చేస్తానని ప్రకటించినట్లు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఆ పార్టీలో చేరి పవన్ కళ్యాణ్ కి తోడుగా ఉంటుందని మీడియాలో కథనాలు వైరల్ అయ్యాయి. రేపోమాపో పార్టీలే చేరిపోతుందని ప్రచారం సాగింది. ఈ ప్రచారంపై రకరకాల విశ్లేషణలు సైతం తెరపైకి వచ్చాయి. ఇంతకాలం జనసేన ఊసులేని అమ్మడు ఇప్పుడే పనిగట్టుకుని పార్టీ ప్రచారం ఏంటి? దీని వెనుక ఏదైనా ఎత్తుగడ ఉందా? అని కొన్ని ఊహాగానాలు నెట్టింట తెరపైకి వచ్చాయి.తాజాగా ఈ ప్రచారాలన్నింటిని అనసూయ ఖండించింది. తాను తుమ్మినా..దగ్గినా కాంట్రవర్సీ చేస్తున్నారంటూ అసహనాన్ని వ్యక్తం చేసింది. ఓ ఇంటర్వ్యూలో రాజకీయ ప్రవేశం గురించి ఇలా స్పందించింది. 'నాయకుడు నచ్చి..అతడి ఎజెండా నచ్చితే తప్పకుండా ప్రోత్సహిస్తానని చెప్పా. అంతే కానీ పార్టీలో చేరతానని గానీ ప్రచారం చేస్తానని గాని చెప్పలేదు. జనసేన పార్టీ అజెండా నాకెంతో నచ్చింది' అని తెలిపింది. ఆ

కారణంగానే జనసేన పార్టీకి అనసూయ తన మద్దతు ప్రకటించినట్లు క్లారిటీ వచ్చింది. అయితే పార్టీలో చేరకుండా పార్టీని ఏ రకంగా ప్రోత్సహిస్తుందో ? కూడా వివరణ ఇవ్వాలని అడుగుతున్నారు. పార్టీ అజెండా నచ్చినప్పుడు పార్టీ తరుపున క్యాపెనింగ్ చేసినప్పుడే ఆ పార్టీకి తన మద్దతు ఇచ్చినట్లు ఉంటుందని నెటి జనులు అభిప్రాయపడుతున్నారు. అంతేగానీ అజెండా నచ్చిందని.. పార్టీని ప్రోత్సహి స్తానని ఓమాట అనేసి ఊరుకుంటే? ఆ పార్టీ ఎలా గెలుస్తుంది? మీ లాంటి వాళ్లు వెనుకుండో లేదా ముందుండో? నడిపిస్తే పార్టీ కోసం పనిచేసినట్లు ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మరి ఎన్నికలు సమీపిస్తోన్న నేపథ్యంలో ఆ దిశగా అమ్మడు అడుగులు వేస్తుందా? నోటి మాటతోనే సరిపెడుతుందా? అన్నది చూడాలి. ఇటీవలే అనసూయ నటించిన 'రజాకార్' రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఆ సినిమాకి విమర్శకుల నుంచి ప్రశంలొచ్చినా ఫ్లాప్ అయింది. ప్రేక్షకులకు ఆ సినిమా రీచ్ అవ్వేలేదు. భారీ ఎత్తున పాన్ ఇండియా లో రిలీజ్ చేసినా పనవ్వలేదు. ప్రస్తుతం అనసూయ మరో పాన్ ఇండియా చిత్రం 'పుష్ప-2' లో నటిస్తోంది. ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి.

# అంత చిన్న చూపా?

సినిమాల్లో అవకాశాలు రానివారెందరికో ఓటీటీ గొప్ప వేదికగా నిలిచిన సంగతి తెలిసిందే సినిమాల్లో అవకాశాలు రానివారెందరికో ఓటీటీ గొప్ప వేదికగా నిలిచిన సంగతి తెలిసిందే. ఔత్సాహి కులు..ప్రతిభావంతులు అంటూ అదే వేదికపై నిరూపించుకుని అక్కడ నుంచి వెండి తెరకి ప్రమోట్ అవుతున్నారు. ప్రస్తుతం ఓటీటీకి ఉన్న డిమాండ్ నేపథ్యంలో బిగ్ స్క్రీన్ మించి అక్కడ తారాగణమంతా ఫేమస్ అవుతున్నట్లు కనిపిస్తుంది. ఓటీటీలో ఎంత గొప్పకంటెంట్ ప్రేక్షకుల ముందుకొస్తుందో తెలిసిందే. సినిమాల్ని మించిన గొప్ప ఎంటర్ టైన్ మెంట్ని ఓటీటీ వేదికలు అందిస్తున్నాయి. మూడు గంటల సినిమా కంటే ఓటీటీ కంటెంటే? కింగ్ లా ఉందని భావిస్తున్నవారెంతో మంది. అగ్ర హీరోలు.. హీరోయిన్లే ఓటీటీలో పోటీ పడుతున్నారు. తమ స్టార్ డమ్ ని సైతం పక్కనబెట్టి ఓటీటీతో వరల్డ్ అంతా చుట్టేయొచ్చు అన్న కొత్త వ్యూహంతో కదులుతోన్న హీరోలెంతో మంది ఉన్నారు. అది నేడు మార్కెట్ లో ఉన్న ఓటీటీ క్రేజ్. అయితే అలాంటి ఓటీటీ నటుల్నిబాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ కాస్త కించపరిచినట్లే మాట్లాడింది. ఓటీటీ నటులు పెద్ద స్టార్లు కాదని.... స్టార్ అనే పదం తమతో పాటు అంతం అవుతుందేమో అన్న భయాన్ని వ్యక్తం చేసింది. కేవలం సినిమాలు చేసిన హీరోయిన్లు మాత్రమే నటులు అన్నట్లు గా వ్యాఖ్యానించింది. ఓటీటీలో నటించే వారిని ఎవ్వర్నీ కూడా ఆయా సంస్థలు స్టార్లగా మార్చలేకపో తున్నాయని అభిప్రాయపడింది. ఇప్పుడీ వ్యాఖ్యలు నెట్టింట దుమారం రేపుతున్నాయి. అంటే కంగన దృష్టిలో కేవలం హిందీ సినిమాలు చేసే వారే స్టార్లా? మిగతా వారు స్టార్లు కాదా? ఇదెక్కడి న్యాయం అంటూ ఆమెపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పైకొచ్చిన నీవు అలా మాట్లాడటంఏమాత్రం సహేతుకంగా లేదంటున్నారు. ఓటీటీ నటుల్ని కంగన తక్కువ చేసి మాట్లాడిందని మరికొంత మంది మండిపడుతున్నారు. ఇక కంగన రనౌత్ ఇంకా ఓటీటీ వరల్డ్ లోకి అడుగు పెట్టని సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆమెతరం హీరోయిన్లు చాలా మంది ఓటీటీ సిరీస్లు చేస్తున్నారు.

# చిరుత బ్యూటీ రాజకీయాల్లోకి..

ఇటీవలే నేహా శర్మ తండ్రి కాంగ్రెస్ నాయకుడు దీనిని ధృవీకరించడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. 'చిరుత' సినిమాతో టాలీవుడ్ లో తెరంగేట్రం చేసిన నేహాశర్మ ఆ తరవాత పూర్తిగా బాలీవుడ్ లోనే నటిస్తున్న సంగతి తెలిసిందే. శర్మాగాళ్ కెరీర్ ఇటీవల అంతంత మాత్రమే. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అవుతోందని కథనాలొస్తున్నాయి. ఇటీవలే నేహా శర్మ తండ్రి కాంగ్రెస్ నాయకుడు దీనిని ధృవీకరించడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. నేహా శర్మ తండ్రి అజిత్ శర్మ బీహార్‌లోని భాగల్‌పూర్ నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. ఇటీవలి ఇంటర్వ్యూలో నేహా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలనే కోరికను వ్యక్తం చేశాడు. ఇది పార్టీ ద్వారా ప్రతిధ్వనించిన సెంటిమెంట్ అని అన్నాడు. ఆయన ప్రకటనతో నేహా శర్మను ఎంఎల్‌ఏగా చూడగలమని అభిమానులు భావిస్తున్నారు. అయితే ఎన్నికల్లో పోటీ చేసే ముందు ఆస్తుల వివరాల్ని వెల్లడించాల్సి ఉంటుంది. నేహాశర్మ సంపదలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని ప్రయత్నిస్తే తెలిసిన వివరాలివి.. అప్పుడే.. బీహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన నేహా శర్మ 21 నవంబర్ 1987న జన్మించారు. మొదట్లో ఫ్యాషన్ డిజైనర్ కావాలనే కోరిక ఉండేది. దీంతో న్యూ ఢిల్లీలోని గౌరవనీయమైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైన్‌లో విద్యను అభ్యసించేలా చేసింది. అయితే నిఫ్ట్ లో ఉన్నప్పుడే తనలోని మోడల్ కం నటిని గుర్తించింది నేహా. నటిగా ప్రయత్నాలు ప్రారంభించింది. 2007లో టాలీవుడ్‌లో 'చిరుత' చిత్రంతో అరంగేట్రం చేయడంతో కథానాయికగా ప్రయాణాన్ని ప్రారంభించింది. 2010లో ఇమ్రాన్ హష్మీతో కలిసి మోహిత్ సూరి క్రూక్ తో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. క్యా సూపర్ కూల్ హై హమ్, తుమ్ బిన్ 2, తాన్హాజీ, యమ్లా పగ్లా దీవానా 2 వంటి భారీ చిత్రాల్లో నటించింది. ప్రియుణ్ణి ఊహించుకునా! సీఏ వివరాల ప్రకారం.. నేహా శర్మ వార్షిక సంపాదన దాదాపు రూ. 3 కోట్లు. మొత్తం సంపద విలువ-34 కోట్లు. నిజానికి బాలీవుడ్‌లో పాపులారిటీని నేహా శర్మ తెలివిగా క్యాష్ చేసుకుంది. తన వారసత్వ సంపద కలుపుకుని నికర ఆస్తి విలువ 34 కోట్లుగా ఉందని అంచనా. ఈ గణనీయమైన సంపద సినిమాలు.. లాభదాయకమైన బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు .. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రభావవంతమైన ఆదాయం ద్వారా సాధ్యమైంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 20 మిలియన్లకు పైగా అనుచరులను కలిగి ఉన్న ఈ బ్యూటీ సోషల్ మీడియా ఆదాయంలోను ముందంజలో ఉంది. నేహా శర్మ రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందని ఇటీవల వచ్చిన పుకార్లు ప్రజలలో ఆసక్తిని కలిగించాయి. అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ నేహా శర్మ తండ్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అజిత్ శర్మ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. "బాలీవుడ్ నటి అయిన నా కుమార్తె నేహా శర్మ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ ఆసక్తిని వ్యక్తం చేసింది. నేను తనతో చర్చించాను.. కానీ ఆమె ప్రస్తుతం అనేక కమిట్‌మెంట్‌లు షూటింగ్ షెడ్యూళ్లతో బిజీగా ఉంది" అని తెలిపారు.



క్యా సూపర్ కూల్ హై హమ్, తుమ్ బిన్ 2, తాన్హాజీ, యమ్లా పగ్లా దీవానా 2 వంటి భారీ చిత్రాల్లో నటించింది. ప్రియుణ్ణి ఊహించుకునా! సీఏ వివరాల ప్రకారం.. నేహా శర్మ వార్షిక సంపాదన దాదాపు రూ. 3 కోట్లు. మొత్తం సంపద విలువ-34 కోట్లు.